## ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల నూతన కమిటీ



నూతన కార్యవర్గంతో రాష్ట్ర నాయకులు

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 20 : ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలోని రిటైర్డ్ ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని ఆదివారం డిపో ఆవరణలో రాష్ట్ర సహాయక కార్యదర్శి కనుకంట్ల రామచందర్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కే మల్లేశం, కార్యదర్శిగా టీ దివాకర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా ఎండీకే పాషా, సీహెచ్ ప్రభాకర్ రావు, బీ లింగయ్య, సహాయ కార్యదర్శిగా ఎస్‌కే మహబూబ్, జీ మోహన్, ఈ భూమన్న, కోశాధికారిగా టీఎంసింగ్, ప్రచార కార్యదర్శిగా ఆరీఫ్ అలీ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని రీజినల్ అధ్యక్షుడు ఎన్ హనుమంతరావు, ముఖ్య సలహాదారులు కే సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ నర్సింగ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## యాదవ సంఘం మండల కమిటీ



యాదవ సంఘం కమిటీని సన్మానిస్తున్న నాయకులు

కాసిపేట, ఏప్రిల్ 20 : కాసిపేట మండలంలోని కొండాపూర్ యాపలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో యాదవ సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముత్యాల రాజమౌళి, ఉపాధ్యక్షుడిగా రేషవేణి ఓదేలు, జనరల్ సెక్రటరీగా మేరుగు శంకర్, కోశాధికారిగా ముత్యాల రాజన్న, ముఖ్య సలహాదారులుగా దాడి గట్టయ్య, సభ్యులుగా బొద్దుల మల్లేశ్, రంగ సంతోష్, కొమ్ము భూమయ్య, మేకల చంద్రయ్య, కసాడి భూమయ్య ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీని శాలువాలతో సన్మానించారు. యాదవుల ఐక్యత, ఆర్థిక, సామాజిక రాజకీయాల్లో ముందుండి అభివృద్ధి చెందేందుకు తమవంతు కృషి చేస్తామని కమిటీ ప్రకటించింది. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు బోయిని తిరుపతి, చెన్నవేణి రమేశ్, ముత్యాల నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాపూర్‌లో ఇంద్రవెల్లి అమరులకు నివాళి



దేవాపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

కాసిపేట, ఏప్రిల్ 20 : కాసిపేట మండలం దేవాపూర్ గ్రామంలో ఇంద్రవెల్లి అమరులకు ఆదివారం ఆదివాసీ సంఘాల నాయకులు నివాళులర్పించారు. పోరాటంలో అసువులుబాసి 44 ఏళ్లు అవుతున్న సందర్భంగా అమరవీరుల స్థూపం చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా గౌరవాధ్యక్షుడు పెంద్రం హన్మంతు, మండల గౌరవాధ్యక్షుడు ఆత్రం జంగు, కొడప శేఖర్, సెడ్మాకి కృష్ణ, సిడాం తరుణ్, కనక భీంరావ్, సోయం ఇందురావ్, సెడ్మాకి జంగు, మడావి తరుణ్, కుర్సింగ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## చదువుతోనే ఉజ్వల భవిష్యత్



అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు రమేశ్

చింతలమానేపల్లి, ఏప్రిల్ 20 : చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆదర్శ ఉపాధ్యాయుడు సుందిల్ల రమేశ్ పేర్కొన్నారు. అక్షర యాత్రలో భాగంగా మండలంలోని ఆడేపల్లిలో సమావేశం ఏర్పాటు చేసి, అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. మారుమూల అటవీ ప్రాంతాల్లో ప్రజలకు అక్షరాస్యత యొక్క ప్రాముఖ్యత వివరిస్తూ, ఆదివాసి బిడ్డలు అక్షరాయుధులు కావాలని సూచించారు. మూఢనమ్మకాలు, వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సంతోష్ గౌడ్, నరసింహులు, భీంరావ్, అర్జయ్య, నాగయ్య, మహేశ్, సత్తయ్య పాల్గొన్నారు.

## అవగాహన సదస్సు

చెన్నూర్, ఏప్రిల్ 20 : భూ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి నూతన ఆర్‌వోఆర్ చట్టాన్ని రూపొందించినట్లు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ అన్నారు. చెన్నూర్‌లోని మైనార్టీ ఫంక్షన్‌హాల్‌లో భూ భారతి ఆర్‌వోఆర్ చట్టంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ మల్లికార్జున్‌లు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ దవాఖానలో ఇందిరా మహిళ శక్తి పథకంలో భాగంగా మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు.

జైపూర్, ఏప్రిల్ 20 : మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతి పోర్టల్‌పై అవగాహన సదస్సును ఎమ్మెల్యే, కలెక్టర్ కుమార్ దీపక్ వివేక్ ప్రారంభించారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. తహసీల్దార్ వనజా రెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో బాపు, అగ్రికల్చర్ ఏవో మార్క్, అధికారులు పాల్గొన్నారు.

మందమర్రి, ఏప్రిల్ 20 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 3, 14వ వార్డుల్లో రూ.10 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు బీ1 ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలను సందర్శించి, సమస్యలు తెలుసుకున్నారు.

## సద్వినియోగం చేసుకోవాలి

దండేపల్లి, ఏప్రిల్ 20 : మక్క కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. దండేపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. జీసీసీ చైర్మన్ కోట్నాక తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేంచంద్, వైస్ చైర్మన్ ఆరీఫ్, డీఆర్డీవో కిషన్, ఏవో అంజిత్‌కుమార్, ఏపీఎం బ్రహ్మయ్య, నాయకులు గడ్డం త్రిమూర్తి, అక్కల వెంకటేశ్వర్లు, ముత్యాల శ్రీనివాస్, రైతులు ఉన్నారు.

**నేడు నస్పూర్‌లో..**

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 20 : నస్పూర్ పట్టణంలోని సీతారాంపల్లి గ్రామ రైతు వేదికలో సోమవారం భూ భారతి ఆర్‌వోఆర్ చట్టంపై అవగాహన సదస్సు ఉంటుందని తహసీల్దార్ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

# రజతోత్సవ సభకు తరలిరావాలి

**బీఆర్ఎస్ నాయకుల విస్తృత ప్రచారం**



మందమర్రి : పులిమడుగులో వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మందమర్రి, ఏప్రిల్ 20 : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో 27న బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పార్టీ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేశ్ పిలుపునిచ్చారు. మందమర్రి మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం రజతోత్సవ సభపై విస్తృత ప్రచారం చేశారు. మండల పరిధిలోని పులిమడుగులో నాయకులు వాల్ పోస్టర్ విడుదల చేశారు. సభకు తరలివెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ లౌడం రాజ్‌కుమార్, జే గౌతమ్, మేకల పుష్పలత, చిప్పకుర్తి అఖిల్, శ్రీనివాస్, మహేశ్, ప్రవీణ్, సాయి కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటపల్లి, ఏప్రిల్ 20 : కోటపల్లి మండలంలో బీఆర్ఎస్ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కోటపల్లి, రాంపూర్, దేవులవాడ, బబెరచెలుక, సిర్సా, నాగంపేట గ్రామాల్లో వాల్ పోస్టర్లు అంటిస్తూ ముందుకు సాగుతున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరుతున్నారు.

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 20 : క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో బీఆర్ఎస్ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. బొక్కలగుట్ట గ్రామ పంచాయతీలో చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారమేశ్ పోస్టర్లు ఆవిష్కరించారు. కుర్మపల్లి, క్యాతనపల్లి, విఠల్ నగర్, మారుతినగర్‌లో వాల్ పోస్టర్లు అంటించారు. నాయకులు, అలుగుల సత్తయ్య, వీనెంక శ్రీనివాస్, భీరయ్య, తిరుపతి, రవీందర్, నస్పూరి శివ, నాగుల మల్యాల రాజ శేఖర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

**విజయవంతం చేయాలి : మాజీ ఎంపీపీ బాపు**



చెన్నూర్ రూరల్ : మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ మంత్రి బాపు

చెన్నూర్ రూరల్, ఏప్రిల్ 20 : రజతోత్సవ సభను విజయవంతం చేయాలని చెన్నూర్ మాజీ ఎంపీపీ మంత్రి బాపు పిలుపునిచ్చారు. ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెన్నూర్ పట్టణంలో రాసిన వాల్ రైటింగ్స్‌పై మున్సిపల్ అధికారులు తెల్లరంగు వేయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనరల్ తన ఉద్యోగాన్ని మర్చిపోయి ఎమ్మెల్యేకు ప్రధాన అనుచరుడిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పక్కనపెట్టి, మంత్రి పద వికోసం ఎమ్మెల్యే ఆరాటపడుతున్నాడని విమర్శించారు. రజతోత్సవ సభలో కేసీఆర్ ప్రసంగంతో కాంగ్రెస్ పాలన గురించి ప్రతి ఒక్కరికీ అర్థమవుతుందని, ఇప్పటికే ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిపోయిందన్నారు.

చింతలమానేపల్లి, ఏప్రిల్ 20 : మండలంలోని బాబాపూర్‌లో బీఆర్ఎస్ మండల నాయకులు పోస్టర్ విడుదల చేశారు. మండలాధ్యక్షుడు గోమాసి లాహాంచు, బాబాపూర్ గ్రామ అధ్యక్షుడు మేకల శంకర్, యూత్ అధ్యక్షుడు భూపతి మధూకర్, ఉపాధ్యక్షుడు ఎదుల సాగర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



కోటపల్లి : నాగంపేటలో..



రామకృష్ణాపూర్ : క్యాతనపల్లి మున్సిపాలిటీ 10వ వార్డులో..



చింతలమానేపల్లి : బాబాపూర్‌లో..

# అందని గ్యారెంటీలు..

## కోటపల్లి మండలం పారుపల్లిలో సుమారు 10 మందికి దక్కని ఆరు పథకాలు

- ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్ చేయని అధికారులు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు
- ఏడాది నుంచి నష్టపోతున్న గ్రామస్తులు
- న్యాయం చేయాలని వేడుకోలు

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియపై అధికారుల నిర్లక్ష్యపు గ్రహణం పట్టింది. దరఖాస్తు చేసినా ఆన్‌లైన్ చేయకపోవడం అర్హులకు శాపంగా మారింది. గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, చేయూత, మహాలక్ష్మి, యువవికాసం పథకాలు అందకుండా పోతుండగా, దరఖాస్తుదారుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. కోటపల్లి మండలం పారుపల్లికి చెందిన పలువురు.. ఏడాది నుంచి కార్యాలయాల చుట్టూ తిరిగినా.., న్యాయం చేయాలని వేడుకున్నా అధికారుల నుంచి ఫలితం శూన్యంగా కనిపిస్తున్నది. - కోటపల్లి, ఏప్రిల్ 20

ఆరు గ్యారెంటీల అమలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ పేరిట గ్రామసభలు ఏర్పాటు చేసి, దరఖాస్తులు స్వీకరించారు. 2023, డిసెంబర్ 28 నుంచి 2024, జనవరి 6 వరకు ఈ గ్రామసభలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు దరఖాస్తులు సమర్పించారు. కోటపల్లి మండలం పారుపల్లి గ్రామంలోనూ పెద్ద సంఖ్యలో చేసుకున్నారు. కాగా, వీటి ఆన్‌లైన్ ప్రక్రియపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వారి వివరాలు ఆన్‌లైన్ కాలేదు. దీంతో గ్రామంలోని సుమారు 10 మంది ఏడాది కాలంగా పథకాలు అందక నష్టపోతున్నారు. దరఖాస్తులు స్వీకరించిన అధికారులు, అన్ని ఫారాలను ఆన్‌లైన్ చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శించారు. దీంతో మండల కార్యాలయం, జిల్లా కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. ఎక్కడికి వెళ్లినా తమకు న్యాయం జరుగడంలేదని అంటున్నారు. దరఖాస్తుల ఆన్‌లైన్ సమయంలో పంచాయతీ కార్యదర్శి సరైన దృష్టి పెట్టకపోవడంతో తీవ్ర అన్యాయం జరిగిందని వాపోతున్నారు.

**ఆన్‌లైన్ సమయంలో నిర్లక్ష్యం..**



ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు (ఫైల్)

ప్రజాపాలన గ్రామసభలో వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్‌పై నిర్లక్ష్యం కారణంగా అర్హులు ప్రస్తుతం ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. డాటా ఎంట్రీ సమయంలో ఆపరేటర్లకు ఎన్ని దరఖాస్తు ఫారాలు ఇచ్చారు.., ఎన్ని దరఖాస్తులు ఆన్‌లైన్ చేశారనే వివరాలు చూసుకోకుండానే ప్రక్రియ పూర్తి చేయడంతో ప్రస్తుతం పారుపల్లి గ్రామానికి చెందిన మంచాల శ్రీనివాస్, గడ్డల బాపు, గడ్డం పోచాలు, శనిగారపు రాజబాపు, మాదాసు సమ్మయ్య, కావేరి సౌభాగ్య, గడ్డం దుర్గయ్య, సప్పిడి రాజబాపుతో పాటు, పలువురికి ఆరు గ్యారెంటీలు అందని ద్రాక్షగానే మారాయి. దరఖాస్తు ఆన్‌లైన్ అనంతరం దరఖాస్తుదారుడికి సంబందించిన నంబర్ రాగా, ఆ నంబర్ రాసిన దరఖాస్తు ఫారాన్ని ఆన్‌లైన్ పూర్తి అయినట్లు పరిగణించారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి పక్కన పెట్టి గ్రామసభలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ పూర్తయినట్లు నిర్ధారించడంతో ఈ గ్రామస్తులు నష్టపోతున్నారు.

**ఆపరేటర్లు ఆన్‌లైన్ చేయలే..**

పారుపల్లి గ్రామ పంచాయతీలో పలువురి వివరాలు ఆన్‌లైన్ కాలేదు. గ్రామంలో దరఖాస్తులు స్వీకరించిన తర్వాత, వివరాల ఆన్‌లైన్ కోసం ఆ ఫారాలు డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇచ్చాం. కానీ, వారు ఆన్‌లైన్ చేయలేదు. దీంతో ఈ గ్రామంలోని వారి వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. అయితే దరఖాస్తుల స్వీకరణ తరువాత ఆన్‌లైన్ చేసేందుకు గడువు దగ్గరపడింది. దీంతో ఎంట్రీ సమయంలో ఎన్ని ఫారాలు ఇచ్చారో.., ఎన్ని ఆన్‌లైన్ చేశారో చూసుకోలేకపోయిన.

- గోదారి తిరుపతి, కార్యదర్శి, పారుపల్లి గ్రామ పంచాయతీ

**ప్రభుత్వ పథకాలు అందడంలేదు..**



మా ఊళ్లె ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణకు గ్రామసభ పెట్టిన్రు. స్వయంగా నేనే పోయి దరఖాస్తు చేసిన. నాకు అధికారులు రసీదుపై నంబర్ కూడా వేసి ఇచ్చిన్రు. కానీ, నా వివరాలు ఆన్‌లైన్ చేయకపోవడంతో ఏ పథకమూ అందుతలేదు. 200 యూనిట్లలోపు ఉచిత కరెంట్‌తో పాటు, గ్యాస్ సిలిండర్‌పై రాయితీ వస్తలేదు. నాకు న్యాయం చేయాలని మండలాఫీసుకు పోయినా పనికాలే. మా ఊరోలందరం కలెక్టర్ ఆఫీసుకు పోతే దరఖాస్తు తీసుకున్నరు గని, పురోగతి లేదు.

- మంచాల శ్రీనివాస్, పారుపల్లి

**ఈ నిర్లక్ష్యానికి బాధ్యులెవరు..**



ప్రజాపాలన పథకాల కోసం మేము గ్రామస్తులందరితో కలసి దరఖాస్తు చేసుకున్నం. అధికారులు ఆన్‌లైన్ చేయలేదు. అధికారులు చుట్టూ, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా మా గోడు ఎవరూ పట్టించుకోవడం లేదు. కూలీ పని చేసుకుని బతికే మా కుటుంబ వివరాలు ఆన్‌లైన్ చేయని కారణంగానే మాకు ఎలాంటి పథకాలూ అందులేవు. కోటపల్లి ఎంపీడీవో కార్యాలయానికి ఎన్నిసార్లు పోయినా మా వివరాలు ఆన్‌లైన్ చేయలేదని చెప్పున్నరు. ఆన్‌లైన్ చేయడంలో నిర్లక్ష్యం వల్ల ప్రతినెలా నష్టపోతున్నాం.

- గడ్డం పోచాలు, పారుపల్లి

**మళ్లీ అవకాశం ఇవ్వాలి..**



ప్రజాపాలన గ్రామ సభలో మేము ఇచ్చిన దరఖాస్తును ఆన్‌లైన్ చేయకపోవడంతో ప్రభుత్వ పథకాలకు దూరమైనం. కొంతమంది నిర్లక్ష్యం కారణంగా మాకు ఎలాంటి పథకమూ అందకుండా పోయింది. మాకు న్యాయం చేయాలని కలెక్టర్ ఆఫీసు దాకా పోయినా ఫలితం లేదు. ప్రభుత్వం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు మళ్లీ అవకాశం ఇస్తనని చెప్పింది. కానీ, ఆచరణలో మాత్రం అమలు చేయలేదు. మా లాంటి పేదోళ్ల కోసం మళ్లీ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపట్టి, ఆన్‌లైన్ చేసి న్యాయం చేయాలి.

- కావేరి సౌభాగ్య, పారుపల్లి

# కోయపల్లిలో నీటి కష్టాలు

- వారం రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు బంద్
- గ్రామ పంచాయతీ ట్యాంకర్‌తో సరఫరా






కోయపల్లిలో గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్తులు

చింతలమానేపల్లి, ఏప్రిల్ 20 : చింతలమానేపల్లి మండలం కోయపల్లి గ్రామస్తులు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. వారం రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడం.., అక్కడక్కడా చేతిపంపులున్నా సరిపడా నీరు రాకపోవడంతో తాగునీటి కోం తండ్లాడుతున్నరు. తమకు నీళ్లు సరఫరా చేసేలా కృషిచేయాలని పంచాయతీ కార్యదర్శి సురేశ్‌ను కోరగా, వారం రోజులుగా జీపీ వాటర్ ట్యాంకర్‌తో ఉదయం, సాయంత్రం పంచాయతీ సిబ్బంది సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంపై, మిషన్ భగీరథ (ఆర్‌డబ్ల్యూఎస్) ఏఈ ఉదయ్ వీర్‌ను వివరణ కోరగా.. గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్‌తో నీళ్లు అందిస్తున్నామని తెలిపారు. పైపులైన్ లీకేజీల వల్ల కోయపల్లికి మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌కు నీళ్లు వెళ్లడం లేదని పేర్కొన్నారు. రెండు రోజులకో సారి వాటర్ ట్యాంక్‌కు నీళ్లు ఇస్తున్నామని తెలిపారు. అయితే ఈ మధ్య ఎప్పుడు నీటిని సరఫరా చేశారో తెలుసుకుంటామని, ఇబ్బంది ఉంటే సరిచేస్తామని వెల్లడించారు.

## పల్లె ప్రకృతి వనంలో మంటలు



నిప్పంటుకొని కాలుతున్న డబ్బా పల్లె ప్రకృతి వనం

చింతలమానేపల్లి, ఏప్రిల్ 20 : డబ్బా గ్రామ పల్లె ప్రకృతి వనంలో ఆదివారం సాయంత్రం మంటలు చెలరేగాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల గురించి పంచాయతీ అధికారులు, సెక్రటరీలు పట్టించుకోవడంలేదు. కనీసం వాటివైపు కన్నెత్తిచూడడంలేదు. పల్లె ప్రకృతి వనంలో మంటలు చెలరేగి ఎండిన ఆకులు, చెత్త అంటుకొని చెట్లు కాలుతుండగా, అటుగా వెళ్తున్న స్థానిక యువకులు సోషల్ మీడియాలో షేర్ చేశారు. మంటలు ఆర్పేందుకు అధికారులు, సిబ్బంది ఎవరూ ప్రయత్నం చేయడం లేదని స్థానిక యువకులు మండిపడుతున్నారు. మంట దాటికి వందల చెట్లు మాడిపోయాయి.

## దొంగతనం కేసులో ఒకరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రవికుమార్

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 20 : రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హనుమాన్ నగర్‌లో రెండు ఇండ్లలో దొంగతనం చేసిన కేసులో పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ఇమాన్యూల్‌ను అరెస్ట్ చేసినట్లు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆదివారం తెల్లవారుజామున రామకృష్ణాపూర్‌లోని హనుమాన్ నగర్‌కు చెందిన ఇరుముల్ల శరణ్య ఇంట్లో నిద్రిస్తుండగా, మెడలోని మూడు తులాల పుస్తెలతాడు గుర్తుతెలియన వ్యక్తి లాక్కొని వెళ్లిపోయాడు. పక్కింట్లో బుర్ర రాజేంద్రప్రసాద్ కిటికీ పక్కన మొబైల్ ఫోన్ పెట్టగా, ఎత్తుకెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదుచేశారు. బెల్లంపల్లి ఏసీపీ ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసుల సహకారంతో పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించారు. గోదావరిఖనిలోని కాకతీయ కాలనీకి చెందిన గుంజ ఇమాన్యుల్‌గా గుర్తించారు. గోదావరిఖని ఏరియా దవాఖాన చౌరస్తా వద్ద వాహనాల తనిఖీలో భాగంగా బైక్‌పై వెళ్తున్న ఇమాన్యుల్‌ను పట్టుకున్నారు. గోదావరిఖని నుంచి రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ తీసుకువచ్చారు. పుస్తెలతాడు, మొబైల్, బైక్ స్వాధీనం చేసుకున్నారు. 24 గంటల్లో నిందితుడిని పట్టుకున్న పోలీసులను ఏసీపీ రవికుమార్ అభినందించి, రివార్డులు అందచేశారు. ఈ సమావేశంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ జీ రాజశేఖర్, కాశిపేట ఎస్ఐ ప్రవీణ్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ సుందర్ రావు, శ్రీనివాస్, సతీశ్, కాశిపేట కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రెండిళ్లలో చోరీ

హాజీపూర్, ఏప్రిల్ 20 : హాజీపూర్ మండలం రాపల్లి గ్రామంలోని రెండిళ్లలో దొంగతనం జరిగినట్లు ఎస్ఐ స్వరూప్ రాజ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాళ్ల రమ ఈ నెల 19న ఉదయం తన ఇంటికి తాళం వేసి, తల్లిగారి ఇంటికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తాళం పగులకొట్టి ఉండడం గమనించి, ఇంట్లోనికి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. అలాగే పక్కింటి ఊట్నూరి లక్ష్మి తాళం వేసి, కరీంనగర్ దవాఖానకు వెళ్లింది. ఆ ఇంటి తాళం కూడా పగులగొట్టి ఉండడాన్ని గమనించింది. రమ తన ఇంట్లోకి వెళ్లి, చూడగా పావు తుల బంగారం, ఊట్నూరి లక్ష్మి ఇంట్లోని 18 తులాల పట్టగొలుసులు దొంగతనానికి గురైనట్లు శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మహిళ ఆత్మహత్య

బెజ్జూర్, ఏప్రిల్ 20 : బెజ్జూర్ మండల కేంద్రానికి చెందిన సుంకరి లక్ష్మి (53) ఆదివారం కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సుంకరి పురుషోత్తం–లక్ష్మి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు. చిన్న కూతురు సరితకు గతేడాది మహారాష్ట్రలోని సిరోంచకు చెందిన వ్యక్తితో పెళ్లి చేయించారు. కొద్ది రోజుల క్రితమే భర్త చనిపోడంతో బెజ్జూర్‌లోని తలిదండ్రుల వద్దే ఉంటున్నది. తండ్రి పురుషోత్తం శనివారం సరితతో ఇంకెన్ని రోజులు ఇంట్లో ఉంటావని, అత్తగారింటికి వెళ్లాలని గొడవ చేశాడు. దీంతో తండ్రి–కూతురి మధ్య జరిగిన గొడవతో మనస్తాపానికి గురైన తల్లి లక్ష్మి పురుగులు మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి, 108 అంబులెన్స్‌లో మండల కేంద్రంలోని సర్కారు దవాఖానకు తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి కాగజ్‌నగర్ సర్కారు దవాఖానకు తరలించారు. అప్పటికే లక్ష్మి మృతిచెందింది. భర్త పురుపోత్తం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఓపెన్ పరీక్షలు ప్రారంభం

నస్పూర్, ఏప్రిల్ 20 : మంచిర్యాల జిల్లాలో ఆదివారం నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రారంభమైనట్లు డీఈవో యాదయ్య తెలిపారు. పరీక్షల కోసం జిల్లాలో 8 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మొదటి రోజు పదోతరగతిలో 494 మందికి 431 మంది హాజరవగా, 63 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఇంటర్‌లో మొత్తం 935 మందికి 814 మంది హాజరవగా, 121 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. అన్ని కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతగా జరిగినట్లు వివరించారు.

బెల్లంపల్లి, ఏప్రిల్ 20 : బెల్లంపల్లిలో రెండు ఇంటర్, ఒకటి టెన్త్ పరీక్షా కేంద్రాలు నిర్వహించారు. బెల్లంపల్లి బజార్ ఏరియా జడ్పీ ఉన్నత, బెల్లంపల్లి బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంటర్, బెల్లంపల్లి ప్రభుత్వ పాఠశాలలో టెన్త్ పరీక్షా కేంద్రాలను నిర్వహించారు. 26వ తేదీ వరకు జరగనున్నాయి. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 20 : కాగజ్‌నగర్ మండలంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నజ్రుల్ నగర్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రెబ్బెన, ఏప్రిల్ 20 : రెబ్బెన మండలం పులికుంట గ్రామంలో విద్యుత్ అంతరాయం ఉంటుందని రెబ్బెన ఏఈ ఇమ్రాన్ తెలిపారు. మరమ్మతుల కారణంగా ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.